వదలని వాన.. వీడని వేదన

- పనులు లేక.. భవన నిర్మాణ కార్మికుల పస్తులు
- ప్రభుత్వం ఆదుకోవాలని విన్నపం



ఉపాధి కోసం ఎదురు చూస్తున్న భవన నిర్మాణ కార్మికులు

మల్కాపురం: కొన్ని రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పారిశ్రామిక ప్రాంతంలో వేలాది మంది భవన నిర్మాణ కార్మికులు ఉపాధి లేక ఇబ్బంది పడుతున్నారు. వర్షం కారణంగా భవన నిర్మాణ పనులు నిలిచిపోవడంతో ఇల్లు గడవక తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. పారిశ్రామిక ప్రాంతంలోని ఏడు వార్డుల పరిధిలో సుమారు 8 వేల మంది భవన నిర్మాణ కార్మికులు జీవిస్తున్నారు. సొంతూళ్లలో ఉపాధి లేక భార్యాబిడ్డలతో పారిశ్రామిక ప్రాంతానికి పదేళ్ల కిందట వచ్చారు. వీరిలో చాలా మంది అద్దె ఇంట్లో నివాసాలుంటున్నారు. వీరు బయటికెళ్లి పని చేస్తేనే వారి ఇల్లు గడుస్తుంది. కానీ వర్షాల వల్ల ఉపాధి కి దూరమయ్యారు. వీరు పని కోసం రోజూ లేబర్ జంక్షన్ వద్ద ఎదురు చూస్తుంటారు. మేస్త్రీలు వచ్చి కావాల్సిన వారిని తమతో పనికి తీసుకెళ్తారు. అయితే వర్షాల వల్ల పనులు లేక వీరు ఖాళీగా ఉంటున్నారు. ప్రస్తుతం ఉపాధి లేక ఇంటి ఖర్చులకు అప్పులు చేయాల్సిన పరిస్థితి వచ్చిందని వాపోతున్నారు. ఇటువంటి పరిస్థితిలో ప్రభుత్వం తమను ఆదుకోవాలని భవన నిర్మాణ కార్మికులు కోరుతున్నారు.

చాలా ఇబ్బంది పడుతున్నాం



ఆరు రోజులుగా ఉపాధి లేదు. ఎక్కడా అప్పు కూడా పుట్టలేదు. అలాగని తిండి లేకుండా బతకలేం కదా. సాధారణంగా మాకు రోజూ పని ఉంటుంది. వర్షం వల్ల పని లేక చేతిలో పైసా ఆడటంలేదు. మాలాంటి వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాం.

– నాయుడు, భవన నిర్మాణ కార్మికుడు, లేబర్ జంక్షన్

ప్రభుత్వం ఆదుకోవాలి



తుపాను కారణంగా దాదాపు వారం రోజుల నుంచి ఎక్కడా పని దొరకలేదు. రోజూ లేబర్ జంక్షన్ వద్ద గొడుగు పట్టుకుని పని కోసం ఎదురు చూడటం.. పని లేక నిరాసతో వెనుదిరగడం జరుగుతోంది. మాలాంటి వారి గురించి ప్రభుత్వం ఆలోచన చేసి ఆర్థికంగా అండగా నిలవాలి.

– కుమార్, భవన నిర్మాణ కార్మికుడు, లేబర్ జంక్షన్

క్లుప్తంగా

ఆర్థిక నేరాలు అరికట్టాలి



ప్రతిభ చూపిన విద్యార్థినికి జ్ఞాపిక అందజేస్తున్న అతిథులు

మల్కాపురం: ప్రజల రక్షణకు పెద్దపీట వేయడంతో పాటు పెరుగుతున్న ఆర్థిక నేరాలు అరికట్టాలని, కార్మిక హక్కులను కాపాడాలని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ఆవరణలో నూతన ఆర్థిక విధానం – 1991 తీరు తెన్నులు అనే అంశంపై బుధవారం సదస్సు నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ నూతన ఆర్థిక విధానం వల్ల ప్రైవేటీకరణ,సరళీకరణ,ప్రపంచీకరణ విధానాలు ఆర్థిక వ్యవస్థ రూపురేఖలు మార్చి వేస్తాయని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు నూతన ఆర్థిక విధానాలపై వ్యాస రచన పోటీలు నిర్వహించిన ప్రతిభ చూపిన వారికి జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో కళాశాల రాజనీతి శాస్త్ర అధ్యాపకురాలు వై.అనసూయాదేవి, ఆర్థికశాస్త్ర అధ్యాపకురాలు సతోమి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

మర్రిపాలెం: జోన్–2 ఎన్ఎస్‌టీఎల్ పరిధిలోని 11 కేవీ కళింగనగర్, శాంతినగర్ ఫీడర్ల నిర్వహణ పనుల్లో(ట్రీ కటింగ్) భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు కళింగనగర్ ఫీడర్ పరిధిలోని మాధవ స్వామి టెంపుల్ రోడ్డు, గడ్డప్ప ఎన్‌క్లేవ్, కళింగనగర్.. శాంతినగర్ ఫీడర్ పరిధిలో అంబేడ్కర్‌నగర్, శాంతినగర్, నేతాజీనగర్, గురజాడనగర్, ఎన్ఏడీ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఈఈ కోరారు.

తెరిపివ్వని వాన

మల్కాపురం: వర్షాలు తగ్గు ముఖం పట్టడం లేదు. తెరిపి ఇవ్వకుండా చిరు జల్లులు కురవడంతో పారిశ్రామిక ప్రాంతం తడిసి ముద్దయింది. నిరంతరం వర్షం కురవడంతో ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు చాలా మంది ఇష్టపడడం లేదు. అయితే బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం12.15 వరకు కాస్తా ఎండ కాయడం హమ్మయ్యా వర్షం పోయింది.. ఎండ వచ్చింది అని సంతోషపడ్డారు. అయితే ఇంతలోనే మధ్యాహ్నం నుంచి తెరిపి లేకుండా తుంపర్లు మాదిరిగా వర్షం కురవడంతో జనం విసుగు చెందుతున్నారు.

అపార్ట్‌మెంట్‌లో కొండచిలువ హల్‌చల్



అపార్ట్‌మెంట్ షెల్లార్‌లో కొండచిలువ

ఆరిలోవ: అర్ధరాత్రి వేళ ఆరిలోవలోని ఓ అపార్ట్‌మెంట్‌లో కొండచిలువ హల్‌చల్ చేసింది. వివరాలిలా ఉన్నాయి. అంబేడ్కర్ కూడలి సమీప హిల్‌వ్యూ అపార్ట్‌మెంట్ షెల్లార్‌లో మంగళవారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో తిరుగుతున్న కొండచిలువను వాచ్‌మన్ ప్రసాద్ చూశారు. అదే సమయంలో అక్కడున్న ఓ ఆటో డ్రైవర్ కూడా గమనించాడు. ఇద్దరూ అపార్ట్‌మెంట్‌లో ఉన్న వారిని అప్రమత్తం చేశారు. సుమారు 6 అడుగుల పొడవు ఉన్న ఆ కొండచిలువను చూసిన నివాసితులు ఆందోళన చెందారు. పోలీసులు, స్నేక్ క్యాచర్‌కు సమాచారం అందించారు. అయితే స్థానికుల్లో కొందరు ధైర్యం చేసి కొండచిలువను చాకచక్యంగా గోనె సంచిలో బంధించి ఇందిరా గాంధీ జూ పార్కుకు అప్పగించారు.

మత్తులో వాహనాలు నడపొద్దు

తగరపువలస: భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలో పలుచోట్ల ట్రాఫిక్ సీఐ కాంతారావు ఆధ్వర్యంలో వాహనాల రాకపోకలపై బుధవారం తనిఖీలు నిర్వహించారు. రన్నింగ్‌లో ఉన్న వాహనాలను నిలిపి ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించడంతోపాటు ప్రయాణికుల భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆటో కార్మికులకు వివరించారు.

గ్రంథాలయ పితామహుడికి ఘన నివాళి



అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయాధికారి తదితరులు

గోపాలపట్నం: గోపాలపట్నం శాఖా గ్రంథాలయంలో బుధవారం గ్రంథాలయ పితామహుడు పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణయ్య జయింతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి గ్రంథాలయాధికారి ఎస్.వి.నరసింహం పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల ఏర్పాటుకు వెంకటరమణయ్య ఎంతో కృషి చేశారన్నారు. పుస్తకాలన్నీ ఒక చోటుకు చేర్చి పాఠకులకు అందించేలా, పుస్తక పఠనంపై ఆసక్తి కలిగించేలా గ్రంథాలయాలను రూపుదిద్దడంలో ఆయన చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో సచివాలయ శానిటరీ కార్యదర్శి ఈశ్వర్, దమ్ము ఓంకార్, కె.విశాల్ నాయుడు, కమలప్రియ తదితరులు పాల్గొన్నారు.

కొండవాలు ప్రాంతాల్లో రక్షణ గోడలు



మాట్లాడుతున్న కార్పొరేటర్ రమణ

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు పరిధిలోని లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌కు ఆనుకొని ఉన్న కొండవాలు ప్రాంతాల్లో రక్షణ గోడలు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని జోన్–8 ఈఈ రత్నాకర్ రెడ్డి, కార్పొరేటర్ బొమ్మిడి రమణ చెప్పారు. కార్పొరేటర్ క్యాంపు కార్యాలయంలో బుధవారంలక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్ వాసులతో సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో ఈ ప్రాంత వాసులు పడుతున్న ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వారి సూచనల మేరకు ఏ ప్రాంతంలో ఏ మేరకు రక్షణ గోడలు నిర్మించాలనే దానిపై సర్వే నిర్వహిస్తామన్నారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని కార్పొరేటర్ రమణ అన్నారు. సమావేశంలో అసిస్టెంట్ ఇంజినీర్ వెంకటలక్ష్మి, న్యాయవాది చవ్వేటి జీవన్ కుమార్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

దంత సంరక్షణతో ఆరోగ్యం



విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ తరుణ్

మురళీనగర్: వ్యక్తిగత ఆరోగ్యానికి దంత సంరక్షణ కీలకమని డాక్టర్ తరుణ్ అన్నారు. స్థానిక మురళీ మాధవ విద్యాలయంలో మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు శ్రీమతి సత్తి లలితారెడ్డి పర్యవేక్షణలో వీ డెంటల్, వీ హెల్త్‌కేర్ డైరెక్టర్ కె.ఎం.కె. రమేష్ సహకారంతో బుధవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దంత సంరక్షణపై విద్యార్థులకు పలు సూచనలిచ్చారు. దంతాలను రెండు పూటలా రెండు నిమిషాల పాటు బ్రష్‌తో శుభ్రం చేసుకోవాలన్నారు. కరోనా వచ్చి తగ్గిన అనంతరం శ్వాస సంబంధిత వ్యాధులతో చాలా మంది బాధపడుతున్నారని, 30 ఏళ్లు దాటిన వారు శ్వాస సంబంధిత పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. 200 మంది విద్యార్థులకు దంత సమస్యలపై వైద్య పరీక్షలు నిర్వహించారు. పాఠశాల అధినేత సనపల మురళీధర్, శ్వాస ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్ మేనేజర్ పి.శ్రీరామ్‌మూర్తి, కార్యదర్శి సిహెచ్.లక్ష్మి, ఉపాధ్యక్షులు సిహెచ్.వరలక్ష్మి, పూర్వాధ్యక్షులు ఎం.శేషామణి, కె.మాధవి, డి.శిరీష, ఎ.రాధ, జి.లక్ష్మి, మురళీ మాధవ విద్యాలయం ప్రిన్సిపాల్ ఎస్.సత్యవతి శిబిరం నిర్వహణకు సహకరించారు.

విద్యుదాఘాతానికి ఆవు బలి

కొమ్మాది: తెగిపడిన విద్యుత్ తీగ తగలడంతో విద్యుదాఘాతానికి గురై ఓ ఆవు మృతిచెందింది. తుఫాన్ నేపథ్యంలో జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ పరిధి రెడ్డిలపాలెంలో 5 రోజుల క్రితం ఈదురు గాలులుకు విద్యుత్ తీగ తెగి పడిపోయింది. దీంతో స్థానికులు ఆ తీగను తొలగించాలంటూ విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఈ క్రమంలో బుధవారం ఉదయం అటుగా వెళ్తున్న ఆవుకు విద్యుత్ తీగ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. విద్యుత్ తీగ తెగిపడి ఉందని ఆ మార్గంలో 5 రోజుల నుంచి తాము రాకపోకలు నిలిపివేశామని రైతు బోర రాజు తెలిపాడు. ఇప్పటికైనా ఆ తీగను అధికారులు తొలగించకుంటే పెను ప్రమాదం తప్పదని, ఇలాంటి విషయాల్లో నిర్లక్ష్యం వహించడం సరైన పద్ధతి కాదంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రశాంత జీవనమే ప్రజాపిత బాబాజీ ఆశయం



బ్రహ్మకుమారీలు, అతిథులను సత్కరిస్తున్న బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతినిధులు

అగనంపూడి: లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ ఓంశాంతి బ్రహ్మకుమారీస్ వ్యవస్థాపకులు ప్రజాపిత బాబాజీ తన యావదాస్తిని దానం చేసి 140 దేశాల్లో శాఖోపశాఖలుగా విస్తరింపజేశారని ముంబయికి చెందిన రాజయోగి బీకే గణేష్ అన్నారు. బ్రహ్మకుమారీస్ అగనంపూడి శాఖ (దివ్యజ్యోతి భవనం) 11వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మానవ జాతి మానసిక పరివర్తనతో ప్రశాంత జీవనం సాగించాలనే సత్సంకల్పంతో ప్రపంచ నలుదిశలా శాఖలు ఏర్పాటు చేశారన్నారు. అనకాపల్లి వర్తక సంఘం అధ్యక్షుడు కొణతాల లక్ష్మీనారాయణ (పెదబాబు) మాట్లాడుతూ బ్రహ్మకుమారీలు చేపడుతున్న ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. విశాఖ జిల్లా కో–ఆర్డినేటర్ రాజయోగి బీకే సోమేశ్వరి, అగనంపూడి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జె.భారతి మాట్లాడారు. ఈ సందర్భంగా సంస్థ ప్రారంభం నుంచి సేవలు అందిస్తున్న 30 మంది బ్రహ్మకుమారీలను సత్కరించారు. కార్యక్రమంలో 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, రిటైర్డ్ హెచ్ఎం బొండా అప్పారావు మాస్టారు, అగనంపూడి ఇన్‌చార్జి బీకే రామకోటి, నాయకులు, వివిధ శాఖల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

హెల్మెట్ ధారణతో సురక్షిత ప్రయాణం



హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తున్న డీఎల్ఎస్ఏ సెక్రటరీ శేషమ్మ

మద్దిలపాలెం: ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేసే క్రమంలో విధిగా హెల్మెట్ ధరించాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ ఎం. వి.శేషమ్మ అన్నారు. హెల్మెట్ ధారణపై మద్దిలపాలెం ఆర్టీసీ డిపో వద్ద బుధవారం ఆర్టీసీ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సురక్షితంగా గమ్యం చేరుకోవడానికి హెల్మెట్ తప్పనిసరన్నారు. విధులకు హాజరయ్యేందుకు ఇంటి వద్ద నుంచి వచ్చేటప్పుడు సిబ్బంది విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్లాపస్ చైర్మన్ వల్లభనాయుడు, ఆర్టీసీ డిప్యూటీ సీటీఎం జి.సత్యనారాయణ, మద్దిలపాలెం డిపో మేనేజర్ ఎస్.అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి ఐసీహెచ్ క్యాంటీన్ల మూత



ఈడీ (వర్క్స్) బిల్డింగ్ వెనుక కెఫెటేరియా

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని ఇండియన్ కాఫీ హౌస్ (ఐసీహెచ్) క్యాంటీన్లు ఈ నెల 27 నుంచి మూత పడనున్నాయి. ఈ మేరకు వారు ఉక్కు వెల్ఫేర్ విభాగానికి లేఖ అందజేశారు. స్టీల్‌ప్లాంట్‌లోని అన్ని విభాగాల్లో యాజమాన్యం ఆధ్వర్యంలో క్యాంటీన్లు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా ఈడీ (వర్క్స్) బిల్డింగ్ వెనుక ఉన్న కెఫెటేరియాతో పాటు కొన్ని విభాగాల్లో మరో నాలుగు నడుస్తున్నాయి. అయితే కొన్ని నెలలుగా మొత్తం ఐదు క్యాంటీన్లకు సుమారు రూ.3 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వారు కొంతకాలంగా బిల్లుల కోసం యాజమాన్యానికి విజ్ఞప్తి చేస్తున్నారు. అయితే బిల్లుల చెల్లింపులు జరగకపోవడంతో ఈ నెల 26 వరకు మాత్రమే తమ క్యాంటీన్లు కొనసాగుతాయన్నారు. 27 నుంచి క్యాంటీన్లు మూసి వేయనున్నామని ఐసీహెచ్ ప్రతినిధి తెలిపారు.

లారీ కిందపడి వ్యక్తి ఆత్మహత్య



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ఎంవీపీ కాలనీ: జాతీయ రహదారి సత్యం కూడలిలో లారీ కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఈ ఘటనపై ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సత్యం కూడలిలో బుధవారం తెల్లవారుజామున 6 గంటలకు ముందు ఓ వ్యక్తి బస్సు కింద పడి ఆత్మహత్య చేసుకొనేందుకు ప్రయత్నించగా.. డ్రైవర్ అప్రమత్తమయ్యారు. బస్సును సడన్‌గా ఆపేయడంతో ఆయన ప్రయత్నం విఫలమైంది. బస్సు డ్రైవర్ దిగి అతన్ని రెండు కొట్టి కూడలి సమీపంలో కూర్చోబెట్టి వెళ్లిపోయాడు. స్థానికులు సైతం అతనికి సపర్యలు చేసి వెళ్లిపోయారు. కొద్ది సేపటి తరువాత మళ్లీ ఆ వ్యక్తి జాతీయ రహదారిపై వస్తున్న మరో లారీ వెనక చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఎంవీపీ పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వివరాలు తెలియదని స్థానికులు చెప్పారు. అయితే ఆయన బస్సు కింద పడేందుకు ప్రయత్నించడం, అనంతరం లారీ కింద పడి మృతి చెందిన ఘటనలను పోలీసులకు వివరించారు. గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో గానీ, 83310 41626 ఫోన్ నంబర్‌లో గానీ సంప్రదించాలని కోరారు.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్సీ శైలజావల్లి

మధురవాడ: సచివాలయ కార్యదర్శులు బాధ్యతాయుతంగా పనిచేయాలని జోనల్ కమిషనర్ శైలజావల్లి ఆదేశించారు. మధురవాడ జోనల్ కార్యాలయంలో జోన్ పరిధిలోని 9 వార్డులకు చెందిన ఎమినిటీస్ సెక్రటరీలతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ముఖ్యంగా పింఛన్లు సకాలంలో పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వం మారిన దృష్ట్యా వచ్చే కొత్త పథకాలు అమలులో కూడా అంతా కృతనిశ్చయంతో పనిచేయాలన్నారు. విభాగాల అధిపతుల సూచనలు, ఆదేశాలు తప్పకుండా పాటించాలన్నారు. విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని, చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ అప్పలరాజు, ఏపీడీ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ కమిషనర్ దృష్టికి 58వ వార్డు సమస్యలు



కమిషనర్ సంపత్‌కుమార్‌కు సమస్యలు వివరిస్తున్న కార్పొరేటర్ లావణ్య, కృష్ణ

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డులో దీర్ఘకాలిక సమస్యలకు అవసరమైన నిధులు కేటాయించాలని కార్పొరేటర్ గులిగిందల లావణ్య, ఆమె తండ్రి కృష్ణ కోరారు. ఈ మేరకు బుధవారం జీవీఎంసీ నూతన కమిషనర్ సంపత్‌కుమార్‌ను ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా వారు కలిసి వినతి పత్రం అందజేశారు. కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందించి, శాలువా కప్పి పరిచయం చేసుకున్నారు. అనంతరం 58వ వార్డులోని సమస్యలను వివరించారు. వార్డులో ఒక రోజు పర్యటించి సమస్యలను గుర్తించి, అవసరమైన నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి కమిషనర్ సానుకూలంగా స్పందించారని కార్పొరేటర్ లావణ్య తెలిపారు. 40, 60, 62 వార్డుల కార్పొరేటర్లు గుండపు నాగేశ్వరరావు, పి.వి.సురేష్, బల్లా లక్ష్మణరావు కూడా జీవీఎంసీ కమిషనర్‌ను కలిసి తమ వార్డుల్లోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించాలని కోరారు.

ఆటపాటలతో అలరించిన విద్యార్థులు



గోపాలపట్నం హైస్కూల్‌లో సంప్రదాయ ఆటలు ఆడుతున్న విద్యార్థులు

గోపాలపట్నం: గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు సంప్రదాయ ఆటలు ఆడుతూ అలరించారు. నిత్యం పుస్తకాలతో కుస్తీ పడుతున్న నేపథ్యంలో అష్టా–చమ్మా, పులి–మేక వంటి పాతకాలం ఆటలు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపాయి. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ అమల్లోకి వచ్చి నాలుగేళ్లయిన సందర్భంగా ఈ నెల 22 నుంచి 28 వరకు పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మూడో రోజు బుధవారం అంతరించిపోతున్న పలు రకాల ఆటలను గుర్తు చేస్తూ విద్యార్థులతో ఆడించారు. కర్రాబిళ్లా, తొక్కుడు బిల్ల, చెమ్మచెక్క, కోతికొమ్మచ్చి, అష్టా చమ్మా, పులి–మేక, గోలీలు, బొంగరం, క్యారమ్స్ కుస్తీ వంటి పలు రకాల ఆటలు ఆడుతూ విద్యార్థులంతా ఉత్సాహంగా గడిపారు.

ఆటలతో పిల్లల మేధస్సుకు పదును

మండల విద్యా శాఖాధికారి డి.దివాకర్ పాతకాలం నాటి ఆటల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అలనాటి ఆటలు పిల్లల మేధస్సుకు పదును పెట్టేలా ఉంటాయన్నారు. అందులో అష్టా చమ్మా, పులిమేక వంటివి ఉన్నాయన్నారు. శారీరక ఆరోగ్యానికి కోతికొమ్మచ్చి, కర్రాబిళ్లా, తొక్కుడు బిల్ల వంటివి దోహదపడేవని చెప్పారు. ఈ నాటి విద్యార్థులకు పూర్వపు ఆటలు, వాటి విశేషాలను తెలిపేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ఆట అనేది చదువును విస్మరించేలా ఉండకూడదని, చదువుతో పాటు వీటికి కొంత సమయం కేటాయించాలని విద్యార్థులకు ఎంఈవో సూచించారు. ఇన్‌చార్జి హెచ్ఎం ఆర్.ఎస్.జోగి, పీడీలు సత్యకళ, దయానంద్, రాజేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంప్రదాయ ఆటలకు ప్రాధాన్యమివ్వాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జ్యోతికుమారి

భీమునిపట్నం: మన సంప్రదాయ ఆటలకు అందరూ ఎక్కువగా ప్రాధాన్యమివ్వాలని జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్) ప్రిన్సిపాల్ ఎం.జ్యోతికుమారి సూచించారు. విద్యా వారోత్సవాల సందర్భంగా బుధవారం ఛాత్రోపాధ్యాయులకు సంప్రదాయ ఆటలైన బిళ్లకర్రా, తొక్కుడు బిళ్ల, టగ్ ఆఫ్ వార్, మ్యూజికల్ చైర్స్, బంతాట నిర్వహించారు. పూర్వ రోజుల్లో ఎన్నో సరదా ఆటలు ఉండేవని, అవి ఆడడం వల్ల శరీరానికి ఎంతో వ్యాయామం జరిగేదన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో అటువంటి ఆటలు తగ్గిపోవడంతో ఆరోగ్య సమస్యలు పెరిగిపోతున్నాయన్నారు. నేటి తరం పిల్లలను ఈ ఆటలు ఆడించాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ మాణిక్యం నాయుడు, అధ్యాపకులు గొట్టేటి రవి, జి.జి.ఎస్. నాగేశ్వరరావు, ఎం.మహాలక్ష్మి, జె.మాధవి, సోమయాజులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో ‘ఉక్కు’కు తీరని అన్యాయం

- కూటమిలో ఉన్నా.. రాష్ట్రానికి బీజేపీ మొండిచెయ్యి
- టీడీపీ, జనసేన మేల్కొని స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించాలి
- సిటూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు



మాట్లాడుతున్న సిటూ నాయకుడు నరసింగరావు

అగనంపూడి: కేంద్ర బడ్జెట్‌లో విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు తీరని అన్యాయం చేసిందని సిటూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 1259వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో పాల్గొన్న నరసింగరావు మాట్లాడుతూ కూటమిలో ఉన్నప్పటికీ బీజేపీ ఏమాత్రం సాయం చేయకుండా విశాఖ ఉక్కుకు, రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, పూర్తి సామర్థ్యంతో కర్మాగారం నడిచేలా బడ్జెట్ సహకారం అందివ్వాలని, ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర స్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ భాగస్వామ్య పక్షాలుగా ఉన్న టీడీపీ, జనసేన ఈ విషయంలో మేల్కొని విశాఖ ఉక్కు పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరించబోమని ప్రకటించే వరకు ఉద్యమాలు ఆపేది లేదన్నారు. కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించకుండా కార్మికులను మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్న ప్రభుత్వం పద్ధతి మార్చుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్టీల్ సిటూ అధ్యక్షుడు వై.టి.దాస్, నాయకులు ఎస్.రామారావు, ప్రతినిధులు శ్రీనివాసరాజు, యు.వెంకటేశ్వర్లు, గంగాధర్, నీలకంఠం, టివికె రాజు, సంతోష్, శివ, పూర్ణచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ జీఎం సంజీవరావుకు సత్కారం



స్టీల్‌ప్లాంట్ జీఎం సంజీవరావును సత్కరిస్తున్న ఐఎస్‌టీడీ కార్యవర్గం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ జనరల్ మేనేజర్ (హెచ్ఆర్) కె.సంజీవరావును ఇండియన్ సొసైటీ ఫర్ ట్రెనింగ్ అండ్ డెవలప్‌మెంట్ (ఐఎస్‌టీడీ) కార్యవర్గం సత్కరించింది. ఈ నెలాఖరున సంజీవరావు పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా ఉక్కు ప్రధాన పరిపాలన భవనంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఐఎస్‌టీడీ చైర్మన్ డాక్టర్ ఓ.ఆర్.ఎం.రావు నేతృత్వంలో కార్యవర్గ సభ్యులు సంజీవరావును సత్కరించి, మొమెంటో అందజేశారు. కార్యక్రమంలో సీసీ విభాగం ఇన్‌చార్జి ఆర్.పి.శర్మ, వెల్ఫేర్ విభాగం జీఎం ఎం.ఎం.రావు, సీఎండీ కార్యాలయం డీజీఎం జె.మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.